సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

ఆదివారం । 2 । జూలై । 2023



వైద్యులు పునర్జన్మ ప్రసాదిస్తారు

తల్లి జన్మనిస్తే వైద్యులు పునర్జన్మ ప్రసాదిస్తారని కలెక్టర్ అనుదీప్, కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు. 8లో



'భారజల' ఎన్నికలు వాయిదా

ఈ నెల 7న జరగాల్సి ఉన్న మణుగూరు భారజల కర్మాగారం ఎంప్లాయీస్ అసోసియేషన్ ఎన్నికలు వాయిదా పడ్డాయి. 8లో



వాతావరణం

జిల్లాలో ఆదివారం ఉష్ణోగ్రత అధికంగానే నమోదవుతుంది. రాత్రి వరకూ వాతావరణం వేడిగానే ఉంటుంది.

న్యూస్‌రీల్

రామయ్యకు వైభవంగా సువర్ణ తులసీ అర్చన



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారికి శనివారం వైభవంగా సువర్ణ తులసీ అర్చన నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం జరిపించారు. ఆ తర్వాత స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. వారాంతపు సెలవు రోజులు కావడంతో భక్తులు పెద్ద ఎత్తున ఆర్జిత సేవల్లో పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఘనంగా శ్రీ బాలాజీ కల్యాణం



కల్యాణ వేడుక నిర్వహిస్తున్న అర్చకులు

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలో కొలువుదీరిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీబాలాజీ వేంకటేశ్వరస్వామి వారి కల్యాణాన్ని శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేకువజామునే స్వామివారికి పంచామృతాభిషేకం, అర్చన జరిపించారు. అనంతరం ఆలయ ప్రధానార్చకుడు ప్రసాదాచార్యులు వేదమంత్రాలతో శాస్త్రోక్తంగా స్వామివారి కల్యాణం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై కల్యాణాన్ని తిలకించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు.

తీపికబురు నీకా.. నాకా ?

మిఠాయిలు తినిపించుకున్న తాటి, జారే



స్వీట్ తిపించుకుంటున్న తాటి వెంకటేశ్వర్లు, ఆదినారాయణ

అశ్వారావుపేట: పీసీసీ ప్రధాన కార్యదర్శి, అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు జన్మదిన వేడుకల్లో శనివారం ఆసక్తికర సంఘటన చోటుచేసుకుంది. జనగర్జన సభకు జనసమీకరణ కోసం అశ్వారావుపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తాటి వెంకటేశ్వర్లు జన్మదిన వేడుకలు నిర్వహించారు. అయితే ఇదే వేదికపై ఉన్న జారే ఆదినారాయణను గతంలోనే పొంగులేటి తన అభ్యర్థిగా ప్రకటించారు. అప్పటికే కాంగ్రెస్ పార్టీలో చేరి.. పీసీసీ ప్రధాన కార్యదర్శి హోదాలో ఉన్న తాటి వెంకటేశ్వర్లు పొంగులేటికి పాత శిష్యుడే. ఇప్పుడు పాత, కొత్త శిష్యులిద్దరూ ఈ వేడుకల్లో మిఠాయిలు తిపించుకున్నారు. ఇంతకీ కాంగ్రెస్ పార్టీ బీఫాం అనే తీపికబురు ఇద్దరిలో ఎవరికి వస్తుందోనని కార్యకర్తలు చర్చించుకున్నారు.

నిత్యసాధనతో క్రీడాకారులకు విజయాలు



క్రీడాకారులను అభినందిస్తున్న సీఈ, తదితరులు

పాల్వంచ: క్రీడాకారులు నైపుణ్యాలను పెంపొందించుకునేందుకు నిత్యసాధన చేయాలని, తద్వారా మంచి ఫలితాలు వస్తాయని కేటీపీఎస్ 5, 6 దశల సీఈ ఎం.ప్రభాకర్‌రావు తెలిపారు. ఇటీవల టీఎస్ జెన్‌కో ఇంటర్ ప్రాజెక్ట్స్ మహిళా టోర్నీలో గెలుపొందిన క్రీడాకారులను శనివారం ఆయన తన కార్యాలయంలో అభినందించారు. ఈసందర్భంగా పి.పార్వతి, పి.చిన్నారి, జి.నాగమణి, వనిత, శ్రీవల్లి, శ్రీలక్ష్మి, ధనలక్ష్మి, కల్యాణి, రెహానా, మౌనిక, సునీత, క్రీడా కార్యదర్శి సెక్రటరీ టి.వీరస్వామి, వైటీఎంకె.రాజు, జేఏఓ జి.వెంకటేశ్వర్లు, సతీశ్, వాసును అభినందించిన ఆయన జాతీయ స్థాయి పోటీల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు. ఎస్ఈలు బి.మోక్షవీర్, వి.వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ సెక్రటరీ పద్మజ, వెల్ఫేర్ ఆఫీసర్ రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గుమ్మడికి గాలం !

- ప్రొటోకాల్ లేకున్నా సభా వేదికపైకి నర్సయ్యకు ఆహ్వానం
- ప్రసంగంలో గుమ్మడి పేరు ప్రస్తావించిన మంత్రి హరీశ్
- గతంలో వినతిపత్రం ఇచ్చేందుకు కూడా దక్కని అవకాశం
- పోడు పట్టాల పంపిణీలో మాజీ ఎమ్మెల్యేకు ప్రాధాన్యతపై చర్చ
- గుమ్మడి కూతురుకు టికెట్ ఇస్తారంటూ ప్రచారం

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పోడు పట్టాల పంపిణీ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా నేత గుమ్మడి నర్సయ్యకు ప్రాధాన్యత లభించడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. వచ్చే ఎన్నికలను దృష్టిలో ఉంచుకునే గుమ్మడికి గాలం వేసేందుకు బీఆర్ఎస్ ప్రయత్నాలు ప్రారంభించిందనే ప్రచారం జోరందుకుంది. ఈ ఏడాది జనవరి 12న ఐడీఓసీ ప్రారంభోత్సవం సందర్భంగా పోడు పట్టాల సమస్యపై సీఎం కేసీఆర్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు గుమ్మడి నర్సయ్య సభా వేదిక వద్దకు రాగా, ఆయనకు ఆ అవకాశం కల్పించేందుకు ఇటు ప్రభుత్వ వర్గాలు, అటు బీఆర్ఎస్ పెద్దలు నిరాకరించారు. దీంతో ఆయన వినతిపత్రం ఇవ్వకుండానే వెనుదిరిగారు. కాగా, గత శుక్రవారం.. పోడు సాగు చేస్తున్న రైతులందరికీ పట్టాలు జారీ చేయాలని మంత్రి హరీశ్‌రావుకు వినతిపత్రం ఇచ్చేందుకు గుమ్మడి నర్సయ్య వచ్చారు. ఈసారి వినతిపత్రం తీసుకోవడమే కాక అనూహ్యంగా ఆయనను వేదికపైకి ఆహ్వానించారు. ప్రొటోకాల్ లేకపోయినా మాజీ శాసన సభ్యుడిని గౌరవిస్తూ అధికారిక కార్యక్రమ వేదిక పంచుకునే అవకాశం కల్పించారు. మంత్రులు హరీశ్‌రావు మొదలు జిల్లాకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు గుమ్మడి నర్సయ్య పేరును తమ ప్రసంగాల్లోనూ ప్రత్యేకంగా ప్రస్తావించారు. దీంతో గులాబీ పార్టీలో కొత్త చేరికలు ఏమైనా ఉంటాయా అనే ప్రచారం మొదలైంది.



కూతురు అనురాధతో మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య

పలు పార్టీల నుంచి ఆహ్వానం..

రాజకీయంగా క్లీన్ ఇమేజ్ ఉన్న గుమ్మడి నర్సయ్యను తమ పార్టీలోకి రావాలంటూ అనేక సార్లు వివిధ పార్టీలు ఆఫర్లు ఇచ్చాయి. కానీ సానుకూల ఫలితం రాబట్టలేకపోయాయి. దీంతో గత కొన్నేళ్లుగా గుమ్మడి నర్సయ్య కుమార్తెలకు టికెట్లు ఇస్తామంటూ పలు పార్టీలు రాయబారాలు నడుపుతున్నాయనేది బహిరంగ రహస్యం. అందులో భాగంగానే తమ వంతు ప్రయత్నాలను గులాబీ పార్టీ నేతలు మరింత ముమ్మరం చేస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. సాధ్యమైనంత త్వరగా గుమ్మడి కుటుంబసభ్యులను 'కారు' ఎక్కించి, ఎంపిక చేసిన నియోజకవర్గంలో తమ అభ్యర్థిగా ఫోకస్ చేయాలనే యోచనలో ఆ పార్టీ నేతలు ఉన్నట్టు చర్చ జరుగుతోంది. అయితే ఇప్పటివరకు ఈ అంశంపై గుమ్మడి కుటుంబ సభ్యుల నుంచి ఎలాంటి ప్రకటనా రాలేదు. రాజకీయంగా జరుగుతున్న ప్రచారాలపై వారు మౌనంగానే ఉన్నారు.

మచ్చలేని నేతగా..

ఇల్లెందు నుంచి గుమ్మడి నర్సయ్య ఐదుసార్లు శాసనసభకు ఎన్నికయ్యారు. సుదీర్ఘ కాలం రాజకీయాల్లో కొనసాగినా ఎక్కడా అవినీతి మరకలు ఆయనకు అంటుకోలేదు. ఎమ్మెల్యేగా పని చేసినప్పుడు కూడా ఆటోల్లో తిరుగుతూ.. వ్యవసాయం చేస్తూ సాధారణ జీవితమే గడిపారు. గుమ్మడి రాజకీయ ప్రస్థానం, జీవన విధానంపై సర్వత్రా ప్రశంసల జల్లు కురుస్తోంది. ఆయనకు ఇద్దరు కుమార్తెలు కాగా, పెద్ద కూతురు కవిత టీచర్‌గా, చిన్న కూతురు అనురాధ లా కాలేజీలో ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. ఈ స్థాయికి చేరుకున్న తొలి ఆదివాసీ మహిళగా అనురాధ రాష్ట్ర వ్యాప్తంగా ప్రాచుర్యం పొందారు. మొత్తంగా గుమ్మడి నర్సయ్య కుటుంబానికి రాజకీయంగా క్లీన్ ఇమేజ్ ఉంది.



పోడు పట్టాల పంపిణీ కార్యక్రమం సభా వేదికపై గుమ్మడి నర్సయ్య

గౌరవించి గొంతు నొక్కేశారు

జిల్లాలో పోడు సాగు చేసుకుంటున్న వారిలో అనేక మందికి పట్టాలు రాలేదు. ఈ విషయాన్ని మంత్రి హరీశ్‌రావు దృష్టికి తీసుకెళ్లేందుకు వినతిపత్రం ఇవ్వాలని సభాస్థలికి వెళ్లాను. ఈ క్రమంలో తనను మాజీ ఎమ్మెల్యేగా గుర్తించి వేదిక మీదకు పిలిచి కూర్చోబెట్టి గౌరవించారు, అయితే పోడు రైతుల పక్షాన వారి సమస్యను వినిపించే అవకాశం కల్పించకుండా గొంతు నొక్కేశారు. మాట్లాడే అవకాశం ఇవ్వనప్పుడు వేదిక పైకి పిలిచి గౌరవించడంలో అర్థం లేదు. దీని వల్ల ప్రజలకు కలిగిన ప్రయోజనం శూన్యం.

– గుమ్మడి నర్సయ్య, మాజీ ఎమ్మెల్యే

వెండి వస్తువులు వితరణ

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారికి విజయవాడకు చెందిన ఇడుపుగంటి రాజారావు, నాగమణి, స్వర్ణ కుమారి, మధుబిందు శనివారం వెండి వస్తువులను వితరణగా అందజేశారు. రూ.1.75 లక్షల విలువైన 2.250 కేజీల వెండిపాత్రలను ఈఓ రమాదేవికి అందజేశారు.



ఈఓకు వెండి పాత్ర అందజేస్తున్న దాతలు

దరఖాస్తుల ఆహ్వానం

కొత్తగూడెంఅర్బన్: జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు జిల్లాలోని అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ సోమశేఖరశర్మ ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్పీ, ప్రభుత్వ, ఏకలవ్య, మోడల్ తదితర స్కూళ్లలో పని చేసే వారంతా ఈనెల 17లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

మేలైన పంటలే ఎంచుకోవాలి

- డిమాండ్‌కు అనుగుణంగా సాగు చేయండి
- తక్కువ ఖర్చుతో అధిక లాభాలు గడించాలి
- 'సాక్షి' ఫోన్ ఇన్‌లో రైతులకు డీఏఓ సూచన



రైతులకు సలహాలు ఇస్తున్న డీఏఓ అభిమన్యుడు, పక్కన ఏడీఏలు లాల్‌చంద్, రవికుమార్

సూపర్‌బజార్(కొత్తగూడెం): సాగులో జాగ్రత్తలు పాటించడంతో పాటు మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలనే వేయాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కొర్స అభిమన్యుడు రైతులకు సూచించారు. తద్వారా ఆర్థికాభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. 'సాక్షి' ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి రైతులు ఫోన్ చేసి, సందేహాలు అడగగా టెక్నికల్ ఏడీఏలు లాల్‌చంద్, రవికుమార్‌తో కలిసి అభిమన్యుడు సమాధానాలిచ్చారు. రైతులు తమ ప్రాంతంలో ఉండే వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు తీసుకుని మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలని, తక్కువ ఖర్చుతో అధిక లాభాలు పొందాలని అన్నారు.



ప్రశ్న: పత్తిపంటలో రకాల గురించి వివరించండి ?

- ఎస్.కిష్కింధర్‌రావు, ఎలుకలగూడెం
- వేణు, కొమ్ముగూడెం, పి. వెంకటేశ్వర్లు, బండ్ల ప్రవీణ్, గొందిగూడెం

జవాబు: పత్తి పంటలో ప్రస్తుతం చాలా రకాల విత్తనాలు లభ్యమవుతున్నాయి. అందులో రాశి-659, టీ -7, మాస్టర్, నవనీత్, ప్లాటినం పెస్టేజ్ వంటివి ఉన్నాయి.

ప్ర: మిర్చిలో ఏయే రకాలు సాగు చేయొచ్చు ?

- బి. రాజు, గొందిగూడెం
- బి. వీరు, ఒంటిగుడిసె

జ: మిర్చిలో మైకో కంపెనీ వారి తేజస్విని, ఎస్ అశ్విని, 2222, 1377, 4884, తేజ, గోల్డెన్ పారోట్, జమున 116, పుష్ప, రెడ్‌హట్, ఎలైట్ తదితరాలు వేసుకోవచ్చు.

ప్ర: వరి విత్తనాల గురించి తెలియజేయండి?

- వై.మోహన్, భీమవరం
- ఎస్.శివ, చర్ల

జ: వరి విత్తనాలు వానాకాలంలో మార్కెట్‌లో డిమాండ్ ఉండి మంచి మిల్లింగ్ శాతం కలిగిన రకాలు ఎంచుకోవాలి. బీపీటీ 5204, ఆర్ఎన్ఆర్ 15048, డబ్ల్యూజీఎల్ 962, కేఎన్ఎం–118 వంటి రకాలను ఎంచుకోవాలి.

ప్ర: పొడి దుక్కుల్లో విత్తనాలు వేస్తే కొన్ని మొక్కలు ఆరోగ్యంగా రావడం లేదు, మొలక శాతం కూడా తక్కువగా ఉంటుంది. ఏం చేయాలి?

- రాంబాబు, బానోత్ వీరు, సర్వారం

జ: సాధారణ పత్తి విత్తనం ఎర్రనేలలో 50 – 60 మి.మీ. నల్లరేగడి నేలలో 60 – 70 మి.మీ వర్షపాతం నమోదు అయిన తరువాతే విత్తుకోవాలి. జిల్లాలో కొన్ని ప్రాంతాలలో చాలీచాలని వర్షపాతం ఉంటే ఇలాంటి పరిస్థితి వచ్చే అవకాశం ఉంటుంది. మళ్లీ మంచి వర్షపాతం నమోదైన తరువాత మొలకెత్తని ప్రదేశంలో తిరిగి విత్తనాలు వేసుకోవాలి. జూలై 15 వరకు వేయొచ్చు.

ప్ర: రుతుపవనాలు వెనక్కు పోతున్నాయి.. పెసర వంటి పంటలు వేయొచ్చా?

జ: రుతుపవనాలు ప్రవేశించినప్పటికీ ఆశించిన స్థాయిలో వర్షపాతం నమోదు కావడం లేదు. కాబట్టి పొలంలో పచ్చిరొట్ట కింద కానీ లేదా పంటగా ఉపయోగపడేలా తక్కువ కాలం పెసర పంట వేసుకోవచ్చు. డబ్ల్యూజీజీ-42ఏనే రకం పంట 60 రోజుల్లో చేతికొస్తుంది. లేదంటే సరిపడా వర్షం నమోదైతే ఈ పెసర పచ్చిరొట్టగా ఉపయోగపడుతుంది. సాధారణంగా పచ్చిరొట్ట వలన భూసారం పెరుగుతుంది. ఇతర రసాయనిక ఎరువుల ఖర్చు తగ్గుతుంది. జీలుగ 8 –10 టన్నులు, పిల్లిపెసర 6 – 8 టన్నులు, జనుము 4 – 6 టన్నుల పచ్చిరొట్ట వస్తుంది.

ప్ర: అదనపు సాంద్రత పత్తిసాగు విధానం ఎలా?

- శ్రీశైలంరెడ్డి, ఎలుకలగూడెం
- జి హరిబాబు, బోగ సంజీవరావు, గొందిగూడెం

జ: అధిక సాంద్రత పత్తి విధానంలో ఎకరాకు 5 ప్యాకెట్ల విత్తనం సరిపోతుంది. 80X2 సెం.మీ. ఎడంతో ఎకరానికి సుమారు 15 వేల నుంచి 20 వేల మొక్కలు పడతాయి. తర్వాత 40 రోజులకు మెపిక్వాట్ క్లోరైడ్ పిచికారీ చేయాలి. 80 రోజులకు మరోసారి చేయాలి. ఎర్రచెలక నేలల్లో మాత్రమే వేసుకోవాలి. నూజివీడు కంపెనీ వారి ఆర్మత్, విన్నర్, సిరి సీడ్స్ వారి ఆర్‌సీహెచ్ 669 రకాలు అందుబాటులో ఉన్నాయి. సుమారు 15 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది.

ప్ర: పెసర, మినుము, కంది పంటలలో రకాలు తెలియజేయండి?

- బుగ్గ సంజీవరావు, అశ్వాపురం

జ: ప్రస్తుత పరిస్థితుల్లో అరుతడి కింద, వర్షాధారంగా తక్కువ వర్షపాతంతో పెసర, మినుము, కంది పంటలు వేసుకుంటే మంచి దిగుబడి వచ్చే అవకాశం ఉంది. పెసరలో ఎంజీజీ – 295, 351, 347, 348, డబ్ల్యూజీజీ – 42, ఐపీఎం–2, 14, ఎంజీజీ – 385, మినుము పీయూ –31, వీబీఎన్ –8, టీబీజీ –104, ఎంబీజీ – 1070, కందిలో ఎంఆర్‌జీ – 1004, 66, డబ్ల్యూఆర్‌జీఈ –97, 255, పీఆర్‌జీ –176, ఆశ, ఎల్ఆర్‌జీ- 41, 51 తదితర రకాలు ఉన్నాయి.

ప్ర: మొక్కజొన్నలో ఏయే రకాలు మేలు ?

- సోయం కోటయ్య, వేములూరు

జ: మొక్కజొన్నలో ఎన్‌కే –30 ప్లస్, పాయనీర్, పీ 3401, 3302, డీహెచ్ఎం 117, ధన్యా డీఎంహెచ్ 8225, ఇతర సీపీ రకాలు వేసుకుంటే మంచి దిగుబడి వస్తుంది. 30 X 8 –10 సెం.మీ. ఎడమలో వేసుకుంటే మంచి మొక్కల సాంద్రత, మంచి లాభాలు వస్తాయి.

గ్రూప్ –4 ప్రశాంతం



పాల్వంచ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద బారులుదీరిన అభ్యర్థులు



- జిల్లాలో 77 కేంద్రాలు ఏర్పాటు
- వివిధ కారణాలతో పరీక్ష రాయని పది మంది..
- సెంటర్లలో కలెక్టర్, అదనపు కలెక్టర్ తనిఖీ

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలో గ్రూప్ –4 పరీక్ష శనివారం ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 77 కేంద్రాలు ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తగా 26,910 మంది అభ్యర్థులు పరీక్ష రాయాల్సి ఉండగా ఉదయం నిర్వహించిన పేపర్–1కు 21,716 మంది హాజరయ్యారు. 5,194 మంది గైర్హాజరయ్యారు. సాయంత్రం పరీక్షకు 21,582 మంది హాజరు కాగా, 5328 మంది గైర్హాజరయ్యారని కలెక్టర్ అనుదీప్ వివరించారు.

పరీక్షకు పది మంది దూరం..

గ్రూప్ –4 పరీక్షకు సంబంధించిన నిబంధనలను అధికారులు ఎంతో కాలంగా ప్రచారం చేస్తున్నారు. అయినా కొందరు అభ్యర్థుల్లో మార్పు రావడం లేదు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల్లో దాదాపు పది మంది అభ్యర్థులు పరీక్షకు దూరమయ్యారు. ఐడీ కార్డుల్లో పేర్లు తప్పుగా ఉండడం, మరికొందరు ఎలాంటి ఐడీ కార్డులు లేకుండానే రావడంతో అధికారులు వారిని లోనికి అనుమతించలేదు. కాగా, దివ్యాంగుల కోసం పరీక్ష కేంద్రాల్లో ఎలాంటి ఏర్పాట్లు చేయకపోవడంతో వారు ఇబ్బంది పడాల్సి వచ్చింది. కొందరు మహిళా అభ్యర్థులు చిన్న పిల్లలతో పరీక్షకు వచ్చి, చిన్నారులను బంధువులకు అప్పగించి లోనికి వెళ్లారు. ఈసారి రెవెన్యూ, అటవీ, ఆరోగ్య, పోలీస్ శాఖల సిబ్బందితో పాటు అంగన్‌వాడీ టీచర్లకు సైతం పరీక్ష విధులు కేటాయించగా, అభ్యర్థులను వారు తనిఖీ చేసి కేంద్రాల్లోకి పంపించారు. లక్ష్మీదేవిపల్లిలోని శ్రీరామచంద్ర డిగ్రీ కళాశాల కేంద్రాన్ని కలెక్టర్ అనుదీప్ పరిశీలించి ఏర్పాట్ల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. పరీక్ష ప్రశాంతంగా ముగియడంతో సిబ్బందిని అభినందించారు.



పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ అనుదీప్

సభకు సర్వం సిద్ధం

నేడు ఖమ్మంలో 'తెలంగాణ జనగర్జన'

- హాజరుకానున్న ఏఐసీసీ అగ్రనేత రాహుల్, ముఖ్యనేతలు
- జన సమీకరణపై నేతల ప్రత్యేక దృష్టి
- దాదాపు ఐదు లక్షల మందిని తరలించేలా ప్రైవేట్ వాహనాలు
- అందరూ సభ వీక్షించేలా భారీ స్క్రీన్ల ఏర్పాటు



సభా వేదిక వద్ద పరిశీలిస్తున్న మాజీ ఎంపీ పొంగులేటి, నాయకులు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: తెలంగాణ జనగర్జన సభను పురస్కరించుకుని కాంగ్రెస్‌లో కోలాహలం నెలకొంది. ఖమ్మంలో ఆదివారం జరగనున్న ఈ సభకు ఏర్పాట్లు పూర్తికాగా.. ఖమ్మం నగరం మొదలు సభా ప్రాంగణం వరకు భారీ కటౌట్లు, పార్టీ తోరణాలతో ముస్తాబు చేశారు. ఓవైపు సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క పీపుల్స్ మార్చ్ పాదయాత్ర ముగింపు, మరోవైపు మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి కాంగ్రెస్‌లో ఇదే వేదికగా చేరనుండడంతో పార్టీలో కొత్త ఉత్సాహం వెల్లివిరుస్తోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా సభకు భారీగా జన సమీకరణ చేస్తుండగా.. దాదాపు ఐదు లక్షల మందిని తరలించేందుకు ప్రైవేట్ వాహనాలను సిద్ధం చేసినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఇక సభ నిర్వహించే ఎస్ఆర్ గార్డెన్స్ వెనుక ఉన్న ఖాళీ స్థలంలో సభా వేదిక, బారికేడ్లు, డిజిటల్ స్క్రీన్ల ఏర్పాటు పూర్తయ్యాయి. ఆవరణలో ఎక్కడి నుంచైనా వేదికను వీక్షించేలా భారీ డిజిటల్ స్క్రీన్లు సిద్ధం చేశారు.

సమీప జిల్లాల నుంచి కూడా...

ఉమ్మడి ఖమ్మం జిల్లాతోపాటు మహబూబాబాద్, సూర్యాపేట తదితర జిల్లాల నుంచి జన సమీకరణకు కొన్ని రోజులుగా కసరత్తు చేస్తున్నారు. అయితే ప్రధానంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాపైనే మాజీ ఎంపీ పొంగులేటి, అనుచరులు దృష్టి సారించారు. ఇక భట్టి అనుచరులు, కాంగ్రెస్ నాయకులు కూడా జనాన్ని తరలించే పనిలో నిమగ్నమయ్యారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లాలోని పలు చోట్ల సన్నాహక సమావేశాలు, ర్యాలీలు నిర్వహించారు. నియోజకవర్గాల వారీగా ఇన్‌చార్జ్‌లుగా నియమితులైన ములుగు ఎమ్మెల్యే సీతక్క తదితరులు శనివారం కూడా జన సమీకరణపై పలు ప్రాంతాల్లో సమీక్షలు చేశారు.

కటౌట్లు, డిజిటల్ ఫ్లెక్సీలు

జనగర్జన సభా వేదికతో పాటు అక్కడకు వెళ్లే మార్గంలో ఇరుపక్కలా కాంగ్రెస్ పార్టీ అగ్రనేతల కటౌట్లు, ఫ్లెక్సీలు ఏర్పాటుచేశారు. అలాగే, మూడు రంగుల కాంగ్రెస్ జెండాలతో నగరాన్ని ముస్తాబుచేశారు. అలాగే, సభావేదికపైనే కాక చుట్టూ భారీ డిజిటల్ స్క్రీన్లు ఏర్పాటుచేశారు. ఇక సభ ప్రాంగణంలో డిజిటల్ కటౌట్లు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. దాదాపు 200 మంది కూర్చునేలా ప్రత్యేక వేదికను సిద్ధం చేశారు.

పార్కింగ్‌కు ఏర్పాట్లు

ఇటు సీఎల్పీ నేత భట్టి విక్రమార్క పాదయాత్ర ముగింపు.. అటు పొంగులేటి శ్రీనివాసరెడ్డి తన అనుచరులతో కలిసి కాంగ్రెస్‌లో చేరుతున్న సందర్భంగా నిర్వహిస్తున్న తెలంగాణ జనగర్జన సభకు భారీగా పార్టీ కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు హాజరవుతారని అంచనా. దాదాపు 5 లక్షల మంది వాహనాల్లోవస్తారనే భావనతో పార్కింగ్ స్థలాలు కూడా ఏర్పాటు చేశారు. వైరా వైపు నుంచి వచ్చే వాహనాలను వి.వెంకటాయపాలెం నుంచి ఎస్ఆర్ గార్డెన్స్ వరకు రోడ్డుకు ఇరువైపులా వంద ఎకరాల స్థలంలో పార్కింగ్ కోసం చదును చేశారు. ఇక వరంగల్, ఖమ్మం రూరల్, కోదాడ, ఇల్లెందు, హైదరాబాద్ వైపు నుంచి వచ్చే వాహనాల కోసం రఘునాథపాలెం బైపాస్ రోడ్డు నుంచి బల్లేపల్లి వరకు రోడ్డు వెంట స్థలాలు సిద్ధం చేయగా... ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చూస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

అక్కడే హెలిప్యాడ్..

ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ హెలికాప్టర్‌లో రానుండటంతో హెలిప్యాడ్‌ను కూడా సభా వేదికకు సమీపానే ఏర్పాటు చేశారు. ఎస్ఆర్ గార్డెన్స్ వెనుకాల పొంగులేటికి సంబంధించిన వంద ఎకరాల స్థలంలో సభాస్థలి ఏర్పాటు చేయగా.. ఓ పక్క ఉన్న గుట్టపై హెలీప్యాడ్‌ను నిర్మించారు. అక్కడి నుంచి సభా వేదికకు రాహుల్‌గాంధీ నేరుగా చేరుకునేలా ప్రత్యేక బారికేడ్లతో రోప్‌వే ఏర్పాటు చేశారు. కాగా, సభాస్థలి వద్ద ఏర్పాట్లను శనివారం సాయంత్రం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి తదితరులు పరిశీలించారు.



జనగర్జన సభాస్థలిలో పూర్తయిన ఏర్పాట్లు

క్లుప్తంగా

క్రీడా పాఠశాలలో ఎంపికకు బ్యాటరీ టెస్ట్



విద్యార్థుల ఎత్తు పరిశీలిస్తున్న పీఈటీలు

పాల్వంచరూరల్: మండలంలోని కిన్నెరసానిలోని గిరిజన క్రీడాపాఠశాలో 6 నుంచి 9వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి శనివారం బ్యాటరీ టెస్ట్ నిర్వహించారు. మొత్తం 15 సీట్లకు గాను ఉమ్మడి జిల్లా నుంచి 85 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఎత్తు, బరువు, క్రీడా సామర్థ్యాలను పరీక్షించడంతో పాటు సర్టిఫికెట్లు పరిశీలించారు. త్వరలోనే ఎంపికైన వారి జాబితా వెల్లడవుతుందని హెచ్ఎం చందు తెలిపారు. ఎంపిక ప్రక్రియలో డాక్టర్ ఎం.వీరూనాయక్, బుగ్గ వెంకటేశ్వర్లు, నగేశ్, బి.మోతీలాల్, వెంకన్న, రాంబాబు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారులపై ఉపా కేసులా?

పీఓడబ్ల్యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి నిర్మల



కృష్ణసాగర్‌లో ప్రదర్శన నిర్వహిస్తున్న పీఓడబ్ల్యూ నాయకులు

బూర్గంపాడు: తెలంగాణ రాష్ట్ర సాధన మలి ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన పీఓడబ్ల్యూ జాతీయ కన్వీనర్ సంధ్యతోపాటు 146 మందిపై కుట్రపూరితంగా ఉపా కేసులు పెట్టడం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టని పీఓడబ్ల్యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి నిర్మల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపా కేసులను ఎత్తివేయాలని శనివారం కృష్ణసాగర్ గ్రామపంచాయతీలోని చింత లక్ష్మీనగర్‌లో పీఓడబ్ల్యూ ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రశ్నించే గొంతుకను అణచివేసేందుకు కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ప్రజలను జాగృతం చేస్తున్న పీఓడబ్ల్యూ నాయకులపై పెట్టిన ఉపా కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ ప్రదర్శనలో ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు రామ్మూర్తి, జక్కం కొండలరావు, పీఓడబ్ల్యూ నాయకులు పెద్దగొని ఆదిలక్ష్మి, సున్నం భూలక్ష్మి, కుర్సం సుజాత, పర్శిక వెంకటరమణ, కొడెం రాధ, బండ్ల కమల, ధనలక్ష్మి, గొగ్గెల ఎర్రన్న, ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

శనీశ్వరునికి తైలాభిషేకం

పాల్వంచరూరల్: మండల పరిధిలోని కేశవాపురం, జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువైఉన్న శ్రీకనకదుర్గ(పెద్దమ్మతల్లి)ఆలయ సముదాయంలో శనివారం శనిత్రయోదశి సందర్భంగా నవగ్రహాలకు, శనీశ్వరునికి అర్చకులు తైలాభిషేక పూజలు జరిపారు. పూజా కార్యక్రమంలో భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

గోశాలలో ఉచితంగా ఎద్దుల పంపిణీ

పాల్వంచ: అక్రమంగా తరలిస్తుండగా స్వాధీనం చేసుకుని సంరక్షణ నిమిత్తం గోశాలకు తీసకొచ్చిన ఎద్దులను రైతులకు ఉచితంగా అందించనున్నట్లు పాల్వంచలోని అన్నపూర్ణ గోశాల సంరక్షణ సమితి ప్రధాన కార్యదర్శి ఆంజనేయశర్మ తెలిపారు. సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు ఈ నిర్ణయాన్ని తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 2, 7వ తేదీల్లో ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఎద్దుల పంపిణీ చేయనుండగా, ఒక్కో రైతుకు రెండు మాత్రమే ఇస్తామని తెలిపారు. అవసరమైన రైతులు నివాస ధ్రువీకరణ పత్రంతో పాటు వ్యవసాయానికి మాత్రమే ఎద్దులను వాడుకుంటామనే హామీ పత్రంతో సంప్రదించాలని సూచించారు. కాగా, ఎద్దులు పాట్టివి చింతూరు, ఒడిశా ప్రాంతానికి చెందినవి ఉన్నాయని ఆయన వివరించారు.


సహకార బ్యాంకు ఉద్యోగుల నిరసన



నిరసనలో పాల్గొన్న డీసీసీబీ ఉద్యోగులు

ఖమ్మంవ్యవసాయం: సహకార బ్యాంకులో రెండంచెల విధానం ప్రవేశపెట్టాలనే డిమాండ్‌తో ఖమ్మం లోని డీసీసీబీ ప్రధాన కార్యాలయం వద్ద శనివారం మధ్యాహ్న భోజన విరామ సమయాన ఉద్యోగులు నిరసన తెలిపారు. తెలంగాణ సెంట్రల్ బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పాశం నాగేందర్ మాట్లాడుతూ సహకార బ్యాంకులో రెండంచెల విధానం ప్రవేశ పెట్టడంతో పాటు ఉద్యోగులకు పెన్షన్ సౌకర్యం అమలు చేయాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా సహకార బ్యాంకులకు మూల ధనాన్ని ఏర్పాటు చేయాలన్నారు. అసోసియేషన్ బాధ్యులు రాజేష్, శ్రీకాంత్, రామకృష్ణ, రామస్వామితో పాటు ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

పామాయిల్ గెలలు




టన్ను ధర	రూ.12,623

వానాకాలంలోనూ ఎండ తీవ్రత

- 38 డిగ్రీలకు చేరిన పగటి ఉష్ణోగ్రతలు
- జిల్లా వ్యాప్తంగా లోటు వర్షపాతం నమోదు

చుంచుపల్లి: సాధారణంగా జూలైలో వర్షాలు కురుస్తుంటాయి. వాతావరణంలో కూడా చల్లబడుతుంది. కానీ ఈ సంవత్సరం ఆ పరిస్థితి కనిపించడం లేదు. రెండు, మూడు రోజులుగా వాతావరణం వేడెక్కింది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. జిల్లాలో శనివారం పగటి ఉష్ణోగ్రతలు 38 డిగ్రీలకు పైగా నమోదు కావడం గమనార్హం. ఇవి సాధారణం కంటే 3 నుంచి 4 డిగ్రీలు అదనం. గడిచిన రెండు వారాలుగా జిల్లాలో మోస్తరు వర్షాలు కూడా పడకపోవడంతో మళ్లీ పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఎండలతో పాటు తీవ్ర ఉక్కపోతకు గురికావాల్సి వస్తుంది. సాధారణంగా జూలైలో పగటి ఉష్ణోగ్రతలు 30 నుంచి 31 డిగ్రీల వరకు ఉంటాయి. ఈ ఏడాది కనిష్టంగా 27, గరిష్టంగా 37 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.



జూన్‌లో లోటు వర్షపాతం

జూన్ వెళ్లిపోయి జూలై వచ్చినా చినుకు జాడ లేక ప్రజలు అల్లాడిపోతున్నారు. నైరుతి రుతుపవనాలు దోబూచులాడుతుండడంతో అటు రైతులు ఆందోళన చెందుతున్నారు. మృగశిర కార్తె ముగిసి ఇటీవలే ఆరుద్ర కార్తె ప్రారంభమైంది. సాధారణంగా ఈ కార్తె నుంచే వర్షాలు బాగా కురుస్తుంటాయి. కానీ జిల్లాలో ఇప్పటివరకు గట్టి వానలు పడ్డ దాఖలాల్లేవు. ఏటా ఈ సమయంలో సాధారణానికి మించి వర్షాలు పడితే రైతులు విత్తనాలు వేసుకునే వాళ్లు. ప్రస్తుతం దుక్కులు దున్ని నాట్లు వేసేందుకు సిద్ధంగా ఉన్న రైతులు ఆకాశం వైపు ఆశగా ఎదురు చూస్తున్నారు. ఇక గత నెలలో కేవలం 5 రోజులు మాత్రమే చిరు జల్లులు పడ్డాయి. జిల్లాలో 14 మండలాల్లో అసలు వర్షపాతమే నమోదు కాలేదు. మరో 7 మండలాల్లో 1 సెం.మీ చొప్పున వర్షపాతం నమోదైంది. ఈ సీజన్‌లో దాదాపు అన్ని మండలాల్లో లోటు వర్షపాతమే కనిపిస్తోంది. ఈ జూన్‌లో సగటున 164.4 మి.మీ వర్షపాతం కురవాల్సి ఉండగా, కేవలం 80.3 మి.మీ మాత్రమే నమోదైంది. మొత్తంగా గత నెలలో 51.2 మి.మీ లోటు వర్షపాతం నెలకొన్నది. గతేడాది ఇదే నెలలో సగటున 144.8 మి.మీ వర్షపాతం పడాల్సి ఉండగా, 225.3 మి.మీ నమోదైంది. ఇది సాధారణం కంటే 55.6 మి.మీ అధికం. గతేడాది జూలైలో జిల్లా వ్యాప్తంగా భారీగా వర్షాలు పడటంతో వాగులు, వంకలు, చెరువుల్లో భారీగా కొత్త నీరు చేరి నిండుకుండను తలపించాయి. సాధారణంగా 326.9 మి.మీ వర్షపాతం పడాల్సి ఉండగా, అత్యధికంగా 605.5 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది.

గ్రూప్-4 అభ్యర్థులకు ఎండపాట్లు

జిల్లాలో గ్రూప్–4 పరీక్షలతో శనివారం కొత్తగూడెం, పాల్వంచ, ఇల్లెందు, భద్రాచలం పట్టణాల్లో సందడి నెలకొంది. పరీక్ష కేంద్రాల వద్ద నిర్వాహకులు, పోలీసులు అభ్యర్థులను తనిఖీ చేశారు. హాల్ టికెట్లు, గుర్తింపు కార్డులు పరిశీలించి లోపలకు పంపించారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో పలువురు అభ్యర్థులు అవస్థ పడ్డారు. ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం చింతగూడెం గ్రామానికి చెందిన ఓ అభ్యర్థి పరీక్ష రాస్తూ తీవ్ర అస్వస్థతకు గురై కిందపడిపోయాడు. అధికారులు భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. పలువురు అభ్యర్థినులు పసిపాపలతో పరీక్ష రాసేందుకు వచ్చారు. కుటుంబీకులు కేంద్రం వెలుపల చెట్ల కింద పిల్లలను ఆడిస్తుండగా, వారు పరీక్షకు హాజరయ్యారు.

–సాక్షి నెట్‌వర్క్



పాల్వంచ రూరల్: ప్రభుత్వ డిగ్రీ కళాశాల కేంద్రం వద్ద గ్రూప్-4 అభ్యర్థులు



కొత్తగూడెం అర్బన్: హాల్ టికెట్ నంబర్లు చూసుకుంటున్న అభ్యర్థులు



భద్రాచలం అర్బన్: అస్వస్థతకు గురైన అభ్యర్థిని పరామర్శిస్తున్న ఆర్డీఓ రత్నకల్యాణి



పాల్వంచ రూరల్: పసిపాపతో పరీక్షకు వస్తున్న అభ్యర్థిని



ఇల్లెందు : క్యూలైన్‌లో అభ్యర్థులు



పాల్వంచ రూరల్: చంటిపాపతో చెట్టు కింద సేదతీరుతున్న కుటుంబీకులు

బీఆర్‌ఎస్‌కు జెడ్పీ చైర్మన్ కనకయ్య రాజీనామా

- ఆయన బాటలోనే పలువురు ప్రజాప్రతినిధులు
- నేడు కాంగ్రెస్‌లో చేరనున్నట్లు వెల్లడి



ఇల్లెందులో మాట్లాడుతున్న జెడ్పీచైర్మన్ కనకయ్య, పక్కన ప్రజాప్రతినిధులు

ఇల్లెందు/టేకులపల్లి: కొన్నాళ్లుగా బీఆర్ఎస్ పార్టీకి దూరంగా ఉంటున్న జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. అలాగే, ఆయనతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. ఇల్లెందులోని క్యాంపు కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన సమావేశంలో కనకయ్య మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీలో సీనియర్లకు గౌరవమర్యాదలు దక్కకపోగా, కొత్త పాత కలుపుకుపోయే పరిస్థితి లేదని తెలిపారు. అలాగే, హామీల అమలుపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఇలాంటి పరిస్థితిలో బీఆర్ఎస్‌లో కొనసాగడం సరికాదని భావించి, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు ప్రకటించారు. గార్ల జెడ్పీటీసీ జాటోత్ ఝాన్సీ సహా పలువురు ప్రజాప్రతినిధులు కూడా బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరుతున్నారని వివరించారు. మున్సిపల్ మాజీ చైర్మన్ యదలపల్లి అనసూర్య, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు. ఇక టేకులపల్లి మండలానికి చెందిన పలువురు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు కూడా రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. టేకులపల్లిలో ఏర్పాటుచేసిన సమావేశంలో సర్పంచ్‌లు పూనెం ఉమ, బోడ నిరోషా, మోకాళ్ల రమాదేవి, యదళ్లపల్లి బాబు, ఊకె నర్సమ్మ, పూనెం రాంబాబు, పాయం సమ్మయ్య, మాడె మధు, భట్టు బాయమ్మ, అజ్మీరా బుజ్జి, బానోతు పూర్ణతో పాటు ఉండేటి ప్రసాద్, బానోతు మౌనిక, బానోతు సరోజిని, సర్ప నర్సింహారావు, డేగటి సత్యనారాయణ తదితరులు మాట్లాడారు. ఆదివారం ఖమ్మంలో జరిగే సభలో పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి కాంగ్రెస్‌లో చేరనున్నట్లు వారు తెలిపారు. కాగా, రాహుల్‌గాంధీ సభను విజయవంతం చేయాలని మాజీ ఎంపీ పొంగులేటి వర్గంతో పాటు కాంగ్రెస్ నేతలు పట్టుదలతో ప్రయత్నిస్తున్నారు. అందులో భాగంగా శనివారం ఇల్లెందు నియోజకవర్గ ఇన్‌చార్జ్ విజయరమణారెడ్డిని జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య కలిశారు. ఇదే సందర్భంగా తొలిసారి ఐఎన్‌టీయూసీ కార్యాలయానికి వచ్చిన కనకయ్యకు కాంగ్రెస్ పట్టణ, మండల అధ్యక్షులు దొడ్డా డానియేల్, పులి సైదులు స్వాగతం పలికారు.

చేరికలు అవాస్తవం

ఇల్లెందు: బీఆర్ఎస్ నుంచి ప్రజాప్రతినిధులు రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య ప్రకటించిన విషయంలో వాస్తవం లేదని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బానోతు హరిసింగ్ నాయక్ తెలిపారు. శనివారం రాత్రి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 56 మంది రాజీనామా చేసినట్లు ప్రకటించటం అవాస్తవమని అన్నారు. రాజీనామా చేసిన వారి జాబితా వెల్లడించాలని సవాల్ చేశారు. తన సామాజిక వర్గం, బంధువులతో కూడిన వారందరినీ కలిసి సంఖ్య పెంచి చూపుకుంటున్నారని, కనకయ్య వెంట ఎవరూ వెళ్లటం లేదని చెప్పారు. ఈ విలేకరుల సమావేశంలో నాయకులు దిండిగాల రాజేందర్, పులిగళ్ల మాధవరావు, రంగనాథ్ తదితరులు ఉన్నారు.

'భారజల' ఎన్నికలు వాయిదా

అశ్వాపురం: ఈ నెల 7న జరగాల్సి ఉన్న మణుగూరు భారజల కర్మాగారం ఎంప్లాయీస్ అసోసియేషన్ ఎన్నికలు వాయిదా పడ్డాయి. గత నెల 21న ఎన్నికల అధికారి మోహన్‌కుమార్ నోటిఫికేషన్ విడుదల చేశారు. కాగా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించి వివిధ సంఘాలకు జరిగే ఎన్నికల విధివిధానాలపై ఇటీవల కేంద్ర ప్రభుత్వం నూతన విధానం తీసుకొచ్చింది. రెండేళ్ల పదవీ కాలం ఉన్న సంఘాలకు రెండుసార్లు ఎన్నికైతే మూడోసారి ఆ వ్యక్తి పోటీకి అవకాశం లేదు. ఐదేళ్ల పదవీ కాలం ఉన్న సంఘాలకు ఎన్నికైన వారు రెండో సారి పోటీకి అవకాశం లేదు. ఈ మేరకు ఇటీవల కేంద్ర ప్రభుత్వ డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ విభాగం ఉత్తర్వులు జారీ చేయడంతో ఎన్నికలు వాయిదా వేశారు. నూతన విధానం అమలుపై పునరాలోచించాలని ఉద్యోగ సంఘాల నాయకులు కోరుతున్నారు. కొత్త విధానం అమలైతే కార్మిక సంఘాల ప్రధాన నాయకులు పోటీకి అనర్హులవుతున్నారు. ఈ నెల రెండో వారంలో 'భారజల'ఎన్నికల రీ నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు సమాచారం. మణుగూరు భారజల కర్మాగారంలో ఎంప్లాయీస్ అసోసియేషన్, ఆర్‌డబ్ల్యూఎస్, సూపర్‌వైజర్ స్టాఫ్ అసోసియేషన్, మూడు సహకార సంఘాలు ఉన్నాయి. ఎంప్లాయీస్ అసోసియేషన్, ఆర్‌డబ్ల్యూఎస్, సూపర్‌వైజర్‌స్టాఫ్ అసోసియేషన్ సంఘాలకు రెండేళ్ల పదవీ కాలం ఉంటుంది. ఈ మూడు సంఘాల్లో గతంలో రెండు సార్లు ఎన్నికైన వారు మూడోసారి పోటీకి అనర్హులవుతారు. మూడు సహకార సంఘాలకు ఐదేళ్ల పదవీ కాలం ఉంటుంది. ఈ మూడు సంఘాల్లో ఒకసారి ఎన్నికైన వారు రెండో సారి పోటీకి అనర్హలవుతారు. ఈ విధానం అమలైతే భారజల కర్మాగారంలో ఆరు సంఘాలకు జరిగే ఎన్నికల్లో కొత్త వారు ఎన్నికయ్యే అవకాశం ఉంది.

11మందిపై కేసు నమోదు

పాల్వంచరూరల్: భూ వివాదంలో దాడి ఘటనలో 11మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని పునుకుల గ్రామానికి చెందిన బొల్లం రాములు, లింగయ్యపై శుక్రవారం రాత్రి అదే గ్రామానికి చెందిన బొల్లం హనుమంతు, శ్రీకాంత్, వినోద్, లింగస్వామి, లింగరాజు, యలమంచి, ఎల్లయ్య, వీరయ్య, కోటయ్య, లింగయ్య, ఉదయ్‌లు దాడిచేసి గాయపరిచారు. బాధితుడు రాములు శనివారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ.శ్రీనివాస్ తెలిపారు.

వైద్యులు పునర్జన్మ ప్రసాదిస్తారు..



పరీక్ష యంత్రాలను ప్రారంభిస్తున్న కలెక్టర్ అనుదీప్, ఎమ్మెల్యే వనమా తదితరులు

కొత్తగూడెంఅర్బన్: తల్లి జన్మనిస్తే వైద్యులు పునర్జన్మ ప్రసాదిస్తారని కలెక్టర్ అనుదీప్, కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రిలో టీ డయాగ్నస్టిక్స్‌లో 134 రకాల పరీక్షల నవీకరణను రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు వర్చువల్ పద్ధతిలో హైదరాబాద్ నుంచి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గతంలో వ్యాధి సోకిన వ్యక్తులకు వివిధ రకాల పరీక్షల పేరుతో భారీగా డబ్బు ఖర్చయ్యేదని, ఇకపై టీ డయాగ్నస్టిక్ కేంద్రం ద్వారా 134 రకాల పరీక్షలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. ఆరోగ్య సేవల్లో ప్రభుత్వం ప్రజలకు అండగా ఉంటుందన్నారు. కొత్తగూడెం, పాల్వంచల్లో అధునాతన ఆస్పత్రులు నిర్మించుకున్నామని, అన్ని పరీక్షలు, వైద్య సేవలు ఉచితంగా అందుతున్నాయని అన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో విప్లవాత్మమైన మార్పు వచ్చిందన్నారు. జిల్లాలో 150 ఎంబీబీఎస్ సీట్లతో మెడికల్ కళాశాల ప్రారంభించుకున్నామని, ఎంబీబీఎస్ రెండో సంవత్సరానికి కూడా అనుమతులు వచ్చాయని వివరించారు. జిల్లాలో 150 మంది డాక్టర్లు తయారు కాబోతుండడం హర్షణీయమన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనులకు మెరుగైన వైద్యం అందించేందుకు అధికారులంతా కృషి చేస్తున్నారని అభినందించారు. ఓపీలో టార్గెట్ ఫిక్స్ చేసుకుని ఉలవ్వనూరు, గుండాల కరకగూడెం, రాగబోయినగూడెం, వినాయకపురం.. ఇలా ఎంత దూరం వారికైనా టీ డయాగ్నస్టిక్స్ హబ్ ద్వారా పరీక్షలు చేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. అనంతరం టీ డయాగ్నస్టిక్స్ ద్వారా అందించే 134 రకాల సేవలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కొత్తగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మణ్‌రావు, ఆస్పత్రి పర్యవేక్షకులు డాక్టర్ కుమారస్వామి, డీఎంహెచ్ఓ డాక్టర్ శిరీష, జెడ్పీ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు, మున్సిపల్ వైస్ చైర్మన్ దామోదర్, కౌన్సిలర్ రుక్మాంగధర్ బండారి, తహసీల్దార్ నవీన్‌కుమార్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాల అధ్యయనం అలవాటుగా మార్చాలి



విద్యార్థి సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న అధికారి నాగరాజ శేఖర్

కరకగూడెం: విద్యార్థులకు పుస్తకాల అధ్యయనం అలవాటుగా మార్చాలని జిల్లా విద్యాశాఖ అకడమిక్ మానిటరింగ్ అధికారి నాగరాజ శేఖర్ పేర్కొన్నారు. శనివారం ఆయన మండలంలోని కేజీబీవీ, కరకగూడెం, భట్టుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను సందర్శించి విద్యార్థుల పఠన సామర్థ్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా నాగరాజశేఖర్ మాట్లాడుతూ సృజనాత్మక ఆలోచనలు, వ్యక్తీకరణ సామర్థ్యానికి ప్రాథమిక స్థాయిలోనే బాటలు పడాలని అన్నారు. ఉన్నత పాఠశాలలకు అందజేసిన లైబ్రరీ పుస్తకాలను చదివేలా ప్రోత్సహించాలని సూచించారు. భట్టుపల్లి ప్రాథమిక, కరకగూడెం ఉన్నత పాఠశాలల విద్యార్థులకు యూనిఫామ్ పంపిణీ చేయకపోవడంతో ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. జీసీడీఓ అన్నామణి తదితరులు పాల్గొన్నారు.

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య

బూర్గంపాడు: ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటనపై శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని క్రాస్‌రోడ్‌కు సమీపంలో ఉన్న అటవీప్రాంతంలో చెట్టుకు ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన గొర్రెల కాపరులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. బూర్గంపాడు ఎస్సై సంతోష్ అక్కడకు చేరుకుని విచారణ చేపట్టారు. మృతుని జేబులో ఉన్న ఆధార్‌కార్డు ఆధారం అతను నాగినేనిప్రోలు గ్రామానికి చెందిన మేడగం వెంకటేశ్వరరెడ్డి (46)గా గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారమిచ్చారు. ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్న వెంకటేశ్వరరెడ్డి కొంతకాలంగా ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాడు. దీంతో మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్నాడని కుటుంబసభ్యులు తెలిపారు. కాగా మృతుని ఇద్దరు కుమారులు ప్రస్తుతం హైదరాబాద్‌లో చదువుకుంటున్నారు. మృతుని భార్య పద్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గ్యాస్ సిలిండర్ లీక్

తప్పిన ప్రమాదం

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని రెవెన్యూ కాలనీలో ఉన్న గణేష్ అనే వ్యక్తి ఇంట్లో శనివారం బంధువులతో కలిసి మహిళలు పిండి వంటలు చేస్తున్నారు. ఈ క్రమంలో ఒక్కసారిగా గ్యాస్ సిలిండర్ లీకై మంటలు వ్యాపించాయి. దీంతో కుటుంబ సభ్యులు అప్రమత్తమై మంటలను ఆర్పివేశారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. సుమారు రూ.30 వేలు వరకు ఆస్తి నష్టం జరిగిందని అంచనా.

మహిళ మెడలో పుస్తెలతాడు చోరీ

ఇల్లెందురూరల్: మండలంలోని బాలాజీనగర్ గ్రామపంచాయతీ సంజయ్‌నగర్ గ్రామంలో మధ్యాహ్నం సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు బైక్‌పై వచ్చి మహిళ మెడలోని బంగారు పుస్తెలతాడును అపహరించారు. బాధితురాలు జోగ అనసూర్య తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మధ్యాహ్నం సమయంలో ఇంటి నుంచి పని నిమిత్తం రోడ్డుపై వెళుతుండగా వెనుక నుంచి బైక్‌పై వస్తున్న గుర్తు తెలియని వ్యక్తులు ఆమె మెడలోని రెండు తులాల బంగారు పుస్తెలతాడును లాక్కొన్నారు. ఆకస్మిక ఘటన నుంచి ఆమె తేరుకునేలోపే దుండగులు అక్కడి నుంచి ఉడాయించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కాపర్ వైరు...

పాల్వంచరూరల్: వ్యవసాయ విద్యుత్ మోటారులోని కాపర్ వైరు చోరీ చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని ఉలవ్వనూరు శివారు లక్ష్మీదేవిపల్లి గ్రామానికి చెందిన గుగులోతు కాంతమ్మ పంట పొలంలో ఉన్న మోటారు వైరును చోరీ చేశారు. రూ.10 వేల విలువైన 20 కేజీల కాపర్‌వైరును దొంగిలించారని శనివారం బాధితురాలు ఫిర్యాదు చేసింది. దీంతో ఎస్ఐ శ్రీనివాస్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

మావోయిస్టు మిలీషియా కమాండర్ అరెస్ట్

చర్ల: సరిహద్దు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో కూంబింగ్ చేస్తున్న పోలీసు బలగాలకు పేలుడు పదార్థాలతో ఓ మావోయిస్టు మిలీషియా కమాండర్ పట్టుబడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. బీజాపూర్ జిల్లాలోని అటవీ ప్రాంతాలలో ఉన్న పోలీస్ స్టేషన్లు, సీఆర్‌పీఎఫ్, క్యాంపుల పరిధిలో వారం రోజులుగా ముమ్మరంగా కూంబింగ్ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో జిల్లాలోని తెర్రెం పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న పటేల్‌పారా వైపునకు వెళ్తున్న డీఆర్‌జీ, సీఆర్‌పీఎఫ్ 168 బెటాలియన్‌కు చెందిన పోలీసు బలగాలకు అనుమానాస్పదంగా ఒక వ్యక్తి కనిపించగా అదుపులోకి తీసుకున్నారు. విచారించడంతో అతను మావోయిస్టు పార్టీ మిలీషియా కమాండర్ అని తేలింది. అతని నుంచి పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకుని, అరెస్ట్ చేశారు.

క్లుప్తంగా...



శనివారం షిరిడీ సాయిబాబాను దర్శించుకున్న తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఈవీ వేణుగోపాల్ దంపతులు. చిత్రంలో దేవస్థానం సీఈవో శివశంకర్

పెచ్చులూడిన శ్లాబ్.. విద్యార్థులకు తప్పిన ముప్పు

రఘునాథపల్లి: జనగామ జిల్లా నిడిగొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పెను ముప్పు తప్పింది. శనివారం నాలుగో పీరియడ్ టైమ్‌లో ఉపాధ్యాయురాలు ఉమామహేశ్వరి క్లాస్ తీసుకోవడానికి తరగతి గదిలోకి వచ్చారు. ఆ సమయంలో శ్లాబ్ పెచ్చులు ఊడిపడ్డాయి. అవి విద్యార్థులు ఉన్నచోట పడక పోవడంతో ప్రమాదం తప్పింది. శనివారం గ్రూప్–4 పరీక్షల నిమిత్తం ఈ స్కూలులోని టేబుళ్లను తీసుకెళ్లారు. దీంతో విద్యార్థులు తరగతి గది చివరిలో కూర్చున్నారు. వారికి ముందు భాగంలో పెచ్చులూడి పడటంతో ముప్పు తప్పింది. కాగా, రూ.55 లక్షలతో 2018లో ఈ పాఠశాల భవనం నిర్మించారు. ఐదేళ్లకే మొదటి అంతస్తు భవనం శ్లాబ్ పెచ్చులు ఊడిపోవడంతో నిర్మాణ పనుల్లో నాణ్యతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



తరగతి గదిలో ఊడి పడిన శ్లాబ్ పెచ్చులు

ఆర్టీసీలో యూనియన్‌లు పునరుద్ధరించాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం (హైదరాబాద్): ఆర్టీసీ యూనియన్‌లను పునరుద్ధరించి యూనియన్ గుర్తింపు ఎన్నికలను వెంటనే జరపాలని టీఎస్‌ఆర్టీసీ జేఏసీ చైర్మన్ అశ్వత్థామరెడ్డి, కన్వీనర్ హనుమంతు ముదిరాజ్‌లు డిమాండ్ చేశారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో టీఎస్‌ఆర్టీసీ జేఏసీ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పెండింగ్‌లో ఉన్న రెండు పీఆర్సీ వేతన సవరణలను చేయడంతో పాటు ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

గ్రూప్‌-4కు 80% మంది హాజరు

- పేపర్‌–1, పేపర్‌–2లో మధ్యస్తంగా ప్రశ్నల స్థాయి
- గణితం నుంచి ప్రశ్నలకు సమాధానాలిచ్చేందుకు ఎక్కువ సమయం పట్టిందన్న అభ్యర్థులు
- ఇటీవల విజయం సాధించిన బలగం చిత్రం నుంచి వచ్చిన ఓ ప్రశ్న



పసి పాపను లాలిస్తున్న గీసుకొండ ఎస్‌ఐ శ్వేత



జగిత్యాల సెంటర్‌లో ఆభరణం తొలగిస్తున్న అభ్యర్థిని



అలస్యంగా వచ్చి కామారెడ్డిలో ఆర్కే డిగ్రీ కళాశాల సెంటర్ వద్ద బయట నిల్చున్న అభ్యర్థులు

సాక్షి, హైదరాబాద్/నెట్‌వర్క్: వివిధ ప్రభుత్వ శాఖల్లో 8,180 వేల ఉద్యోగాల భర్తీకి శనివారం నిర్వహించిన గ్రూప్‌–4 పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. రెండు సెషన్లుగా ఉదయం, మధ్యాహ్నం జరిగిన ఈ పరీక్షలకు 80 శాతం మంది అభ్యర్థులు హాజరైనట్లు టీఎస్‌పీఎస్సీ తెలిపింది. రెండు పరీక్షలకు మొత్తంగా 9,51,205 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా వారిలో 9,12,380 మంది అభ్యర్థులు టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకున్నారు. టీఎస్‌పీఎస్సీ వెల్లడించిన ప్రాథమిక గణాంకాల ప్రకారం ఉదయం 10 గంటల నుంచి 12:30 గంటల వరకు జరిగిన పేపర్‌–1 పరీక్షకు 7,62,872 మంది అభ్యర్థులు హాజరయ్యారు. మధ్యాహ్నం 2:30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగిన పేపర్‌–2 పరీక్షకు 7,61,198 మంది హాజరయ్యారు. పరీక్షా కేంద్రాలవారీగా ఓఎంఆర్ షీట్ల లెక్కింపు తర్వాత హాజరు శాతంపై స్పష్టత వస్తుందని తెలిపింది. పేపర్‌–1 (జనరల్ స్టడీస్), పేపర్‌–2 (సెక్రటేరియల్ ఎబిలిటీస్) పరీక్షల్లో ప్రశ్నలు మధ్యస్తంగా ఉన్నాయని అభ్యర్థులు పేర్కొన్నారు. పేపర్‌–1లో ఎక్కువగా సూటిప్రశ్నలు, అప్లికేషన్ తరహా ప్రశ్నలు వచ్చాయని, పేపర్‌–2లో గణితం నుంచి వచ్చిన ప్రశ్నలకు సమాధానం ఇవ్వడానికి ఎక్కువ సమయం పట్టిందని చెప్పారు. గ్రాఫ్స్, చార్టులతో కూడిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చేందుకు నిమిషం కంటే ఎక్కువ సమయం పట్టిందన్నారు. చాలా వరకు నంబరింగ్ సిస్టంలో ప్రశ్నలు రావడంతో అభ్యర్థులు కాస్త తికమకపడ్డట్లు తెలిసింది. చిన్న సినిమాగా ఇటీవల విడుదలై ఘన విజయం సొంతం చేసుకున్న బలగం చిత్రం నుంచి కూడా ఈ పరీక్షలో ఓ ప్రశ్న రావడం గమనార్హం.

- సూర్యాపేట జిల్లా కోదాడలోని ఓ సెంటర్‌లో శనివారం ఉదయం అభ్యర్థులకు ఇచ్చే ప్రశ్నాపత్రం బండిల్ సీల్ లేకుండా ఉండటంతో అభ్యర్థులు ఆందోళనకు దిగారు. సీలు ముందే తీసి పేపర్ లీక్ చేశారా అని ప్రశ్నించారు. ఓఎంఆర్ షీట్స్ బండిల్ అనుకొని పొరపాటున సీల్ తీశామని ఇన్విజిలేటర్లు, పోలీసులు సర్దిచెప్పడంతో ఆందోళన విరమించారు.
- హైదరాబాద్‌లోని మారుతీనగర్‌లో ఉన్న ఓ కేంద్రంలో కె.రాజేష్ (36) అనే అభ్యర్థి పేపర్‌–1 పరీక్షను సెల్‌ఫోన్లో చూసి రాస్తూ పట్టుబడ్డాడు. కలెక్టర్ ఆదేశంతో అతనిపై మాల్‌ప్రాక్టీస్ కింద కేసు నమోదైంది.
- మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలానికి చెందిన వల్లందాస్ మురళి అనే అభ్యర్థి కాస్త ఆలస్యంగా పేపర్‌–2 పరీక్ష రాసేందుకు రాగా అప్పటికే గేటుకు తాళం వేశారు. దీంతో గోడదూకి లోనికి ప్రవేశించేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకొని వెనక్కి పంపించారు.
- వరంగల్ జిల్లా కొనాయమాకుల వద్ద గల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఓ మహిళ 3 నెలల పాపతో వచ్చింది. అక్కడే డ్యూటీ చేస్తున్న గీసుకొండ ఎస్సై ఎ. శ్వేత ఆ బిడ్డను పరీక్ష సమయం ముగిసే వరకు అక్కున చేర్చుకుంది.
- ఖమ్మం దరిపల్లి అనంతరాములు ఇంజనీరింగ్ కళాశాల కేంద్రంలో ఉదయం పరీక్ష రాసిన వారిలో నలుగురు అభ్యరులు ఓఎంఆర్ షీట్లు ఇవ్వకుండానే బయటకు వెళ్లేందుకు యత్నించగా పోలీసులు వారిని అడ్డుకొని షీట్లు తీసుకున్నారు. అలాగే వారు మధ్యాహ్నం పరీక్ష రాసేందుకు అనుమతి నిరాకరించారు.
- జగిత్యాల జిల్లాలోని గ్రూప్‌–4 పరీక్ష కేంద్రాల వద్ద మహిళా అభ్యర్థులు తమ ఆభరణాలు తొలగించడానికి ఇబ్బంది పడ్డారు.
- జోగుళాంబ గద్వాల జిల్లాలోని ప్రభుత్వ కళాశాలలో పేపర్‌–1 పరీక్ష రాసేందుకు వచ్చి కిటికీ పక్కన కూర్చున్న ఓ అభ్యర్థి ఓఎంఆర్ షీట్ గాలికి కొట్టుకుపోయింది. దాన్ని తెచ్చుకొనేందుకు పోలీసులు అతన్ని అనుమతించకపోగా అక్కడి సిబ్బంది చివరకు షీట్‌ను తీసుకొచ్చారు.
- జడ్చర్లలోని బూర్గుల రామకృష్ణారావు డిగ్రీ కళాశాల కేంద్రంలో ఓ మహిళ అస్వస్థతకు గురి కావడంతో ప్రాథమిక చికిత్స అందించారు.
- ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లావ్యాప్తంగా ఒరిజినల్ ఐడీ కార్డులు తీసుకురాని దాదాపు 100 మంది అభ్యర్థులను పరీక్షకు నిరాకరించారు.
- విద్యుత్ వైరు తెగిపోవడంతో ఖమ్మం జిల్లా కారేపల్లి రైల్వేస్టేషన్ వద్ద సికింద్రాబాద్ నుంచి మణుగూరు వెళ్తున్న రైలు సమీపాన నిలిచిపోయింది. దీంతో గ్రూప్‌–4 పరీక్ష రాసేందుకు రైల్లో వస్తున్న వందలాది మంది అభ్యర్థులు ఉరుకులు పరుగులు తీస్తూ ప్రైవేటు వాహనాల్లో పరీక్ష కేంద్రాలకు బయలుదేరారు.
- వనపర్తి జిల్లాలోని 46 పరీక్ష కేంద్రాల నుంచి అభ్యర్థుల ఓఎంఆర్ షీట్లను తీసుకెళ్లేందుకు రాత్రి 11:15 గంటలు దాటినా టీఎస్‌పీఎస్సీ అధికారులు ఎవరూ రాలేదు. దీనిపై పరీక్షల నిర్వాహణ అధికారి రమేష్‌రెడ్డి మాట్లాడుతూ గద్వాల, వనపర్తి జిల్లాలకు ఒక్కరే అధికారి ఉండటంతో ఆలస్యమైనట్లు చెప్పారు.

ఆర్టీసీ ఎండీకి హైకోర్టు షోకాజ్ నోటీసు

సహకార పరపతి సంఘానికి నిధుల చెల్లింపుల్లో ఆలస్యంపై ఆగ్రహం

సాక్షి, హైదరాబాద్: సహకార పరపతి సంఘాని (సీసీఎస్)కి నిధుల చెల్లింపుపై తాము ఆదేశించినా ఆ మేరకు ఎందుకు చెల్లింపులు చేయలేదో చెప్పాలని ఆర్టీసీ ఎండీకి, చీఫ్ మేనేజర్ (ఎఫ్అండ్ఏ)కు హైకోర్టు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. వ్యక్తిగతంగా లేదా న్యాయవాది ద్వారా హాజరై వివరణ ఇవ్వాలని ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 21కి వాయిదా వేసింది. ఒకవేళ ఎవరూ హాజరుగాని పక్షంలో ఎక్స్‌పార్టీగా పేర్కొంటామని చెప్పింది. సీసీఎస్‌కు జమ చేయాల్సిన నిధులను ఆర్టీసీ సొంతానికి వాడేసుకోవడంతో వడ్డీ సహా రూ.900 కోట్ల బకాయిలు ఏర్పడ్డాయి. ఫలితంగా ఉద్యోగులకు ఈ సంఘం ద్వారా మంజూరు చేయాల్సిన రుణాలు ఆగిపోయాయి. ఈ సంఘంలో పొదుపు చేసుకున్న మొత్తానికి సంబంధించి విశ్రాంత ఉద్యోగులకు చెల్లించాల్సిన వడ్డీ విషయంలోనూ ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. బకాయిల్లో కొంత మొత్తం చెల్లించాలని ఆ సంఘం ఆర్టీసీని కోరుతున్నా స్పందన రాలేదు. దీంతో హైకోర్టును ఆశ్రయించగా, మే 15వ తేదీలోగా రూ.50 కోట్లు, మరో రూ.100 కోట్లను నవంబర్ 25లోగా సీసీఎస్‌కు డిపాజిట్ చేయాలని ఏప్రిల్‌లో హైకోర్టు ఆర్టీసీ యాజమాన్యాన్ని ఆదేశించింది. అయితే కోర్టు ఆదేశాలిచ్చినా ఆర్టీసీ యాజమాన్యం పాటించడం లేదని, కావాలనే ఉల్లంఘిస్తోందని పేర్కొంటూ ఉద్యోగులు జూన్‌లో ధిక్కార పిటిషన్ దాఖలు చేశారు. ప్రతివాదులుగా ఆర్టీసీ ఎండీ, చీఫ్ మేనేజర్‌ను పేర్కొన్నారు. దీనిపై జస్టిస్ పి.మాధవీ దేవి విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫున న్యాయవాది ఏకే జయప్రకాశ్‌రావు వాదనలు వినిపించారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. ఎండీ, చీఫ్ మేనేజర్ హాజరుకావాలంటూ ఆదేశిస్తూ, విచారణను ఈ నెల 21కి వాయిదా వేసింది.

ఫ్యాను హోరు.. కారు జోరు..!

▶ మొదటి పేజీ తరువాయి

జాతీయ మీడియా సంస్థ 'టైమ్స్ నౌ–నవభారత్' సర్వే చేసి ఈ నివేదికను తాజాగా విడుదల చేసింది.

అన్ని సీట్లూ వైఎస్సార్‌సీపీకే..

ఆంధ్రప్రదేశ్‌లో వినూత్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు, కార్యక్రమాలతో సుపరిపాలన అందిస్తూ దూసుకెళ్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి ప్రజాదరణ మరింత పెరిగినట్టు సర్వేలో తేటతెల్లమైంది. గత ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లోని 25 లోక్‌సభ స్థానాలకు 22 సీట్లను గెలుచుకున్న వైఎస్సార్‌సీపీ.. ఇప్పుడు ఎన్నికలు జరిగితే 51 శాతం ఓట్లతో 24–25 స్థానాలు దక్కించుకుంటుందని సర్వే వెల్లడించింది. ఇక టీడీపీ అడ్రస్ గల్లంతవడం ఖాయమని, ఆ పార్టీ 36 శాతం ఓట్లకే పరిమితం అవుతుందని, ఒక్క సీటైనా కచ్చితంగా గెలిచే అవకాశం కనిపించడం లేదని పేర్కొంది. లోక్‌సభలో ఎన్డీయే, కాంగ్రెస్ కూటముల తర్వాత వైఎస్సార్ సీపీ అత్యధిక స్థానాలతో మూడో స్థానంలో నిలుస్తుందని వెల్లడించింది.


తెలంగాణలో బీఆర్‌ఎస్ హవా: తెలంగాణలో 17 లోక్‌సభ స్థానాలు ఉన్నాయి. ఇక్కడ సీఎం కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్‌ఎస్ 37% ఓట్లతో 9 నుంచి 11 స్థానాలు, 29.2% ఓట్లతో కాంగ్రెస్ 2 నుంచి 3 స్థానాలు, 25.3% ఓట్లతో బీజేపీ 3 నుంచి 5 స్థానాలు సాధించవచ్చని తెలిపింది.

మూడోసారీ బీజేపీ సర్కారే..

జాతీయస్థాయిలో వరుసగా మూడోసారి బీజేపీ కూటమి ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని సర్వే పేర్కొంది. ఇప్పుడు ఎన్నికలు నిర్వహిస్తే 543 లోక్‌సభ స్థానాలకు.. బీజేపీ, దాని మిత్రపక్షాలు (ఎన్డీయే) కలిసి 285 నుంచి 325 సీట్లు సాధిస్తాయని వివరించింది. కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు కలిసి 111 నుంచి 149 సీట్లకే పరిమితం అవుతాయని పేర్కొంది. పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ నేతృత్వంలోని టీఎంసీ 20 నుంచి 22 లోక్‌సభ సీట్లు, ఒడిశా సీఎం నవీన్ పట్నాయక్ నేతృత్వంలోని బీజేడీ 12 నుంచి 14 సీట్లు, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రివాల్ నేతృత్వంలోని ఆప్ 4 నుంచి 7 స్థానాలు, అఖిలేశ్ యాదవ్ నేతృత్వంలోని సమాజ్‌వాదీ పార్టీ 4 నుంచి 8 స్థానాలకు పరిమితం అవుతాయని స్పష్టం చేసింది. ఇతరులు 18 నుంచి 38 సీట్లు సాధించే అవకాశం ఉందని అంచనా వేసింది.

2019 ఎన్నికలకంటే మిన్నగా..

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ 2019 సార్వత్రిక ఎన్నికల్లో 50శాతం ఓట్లతో 151 శాసనసభ, 22 లోక్‌సభ స్థానాల్లో విజయకేతనం ఎగురవేయడం ద్వారా రికార్డు సృష్టించింది. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే మేనిఫెస్టోలోని 95 శాతం హామీలను అమలు చేయడం ద్వారా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దేశం మొత్తం చూపును తన వైపు తిప్పుకొన్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నారు. అర్హతే ప్రామాణికంగా వివక్ష, లంచాలకు తావు లేకుండా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారు. నాలుగేళ్లలో సంక్షేమ పథకాల కింద డీబీటీ పద్ధతిలో పేదల ఖాతాల్లో రూ. 2.23 లక్షల కోట్లు జమ చేశారు. వ్యవసాయం, విద్య, వైద్య రంగాలలో విప్లవాత్మక సంస్కరణలు తెచ్చారు. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా పరిపాలను వికేంద్రీకరించి ప్రజల ఇంటి గుమ్మం వద్దనే ప్రభుత్వ సేవలను అందిస్తున్నారు. దాంతో సీఎం వైఎస్ జగన్‌కు ప్రజల్లో ఆదరణ నానాటికీ పెరుగుతోంది. 2019 ఎన్నికల తర్వాత జరిగిన ప్రతి ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీ చారిత్రక విజయాలు సాధించడమే ఇందుకు తార్కాణం. ఇప్పటికిప్పుడు సార్వత్రిక ఎన్నికలు జరిగితే 2019 ఎన్నికల కంటే మిన్నగా.. అంటే 51 శాతం ఓట్లతో 24 నుంచి 25 లోక్‌సభ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ విజయం సాధించడం ఖాయమని టైమ్స్ నౌ–నవభారత్ సర్వేలో వెల్లడైంది.



సర్వే ప్రకారం జాతీయ స్థాయిలో ఎవరికెన్ని సీట్లు?

పార్టీ/కూటమి	సీట్లు
బీజేపీ+మిత్రపక్షాలు	285-325
కాంగ్రెస్+మిత్రపక్షాలు	111-149
వైఎస్సార్‌సీపీ	24-25
తృణమూల్ కాంగ్రెస్	20-22
బిజూ జనతాదళ్	12-14
భారత్ రాష్ట్ర సమితి	9-11
ఆమ్ ఆద్మీ పార్టీ	4-7
సమాజ్‌వాదీ పార్టీ	4-8
ఇతరులు	18-38

తెలంగాణలో ఎవరికెన్ని?

పార్టీ	స్థానాలు
బీఆర్‌ఎస్	9-11
బీజేపీ	3-5
కాంగ్రెస్	2-3

జిల్లా వార్తలు

ఉమ్మడి జిల్లాలో ఎక్సైజ్ అధికారుల బదిలీలు

ఖమ్మంక్రైం: ఉమ్మడి జిల్లాలోని ఎక్సైజ్ శాఖలో పలువురు అధికారులను బదిలీ చేశారు. ఉద్యోగోన్నతి పొంది ఏడాదిన్నరగా పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న ముగ్గురు సీఐలకు పోస్టింగ్ ఇస్తూ ఉన్నతాధికారులు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. పాల్వంచ చెక్‌పోస్ట్‌లో విధులు నిర్వర్తిస్తున్న నాగేశ్వరరావుకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో టాస్క్‌ఫోర్స్ సీఐగా, వైరా మద్యం డిపోలో పనిచేస్తున్న సీహెచ్.పవన్‌కు వరంగల్ జిల్లా లక్ష్మీపురం చెక్‌పోస్ట్‌లో, ఖమ్మం ఎక్సైజ్ స్టేషన్–1లో పనిచేస్తున్న వి.రవికి స్టేషన్ ఘన్‌పూర్ చెక్‌పోస్ట్‌లో పోస్టింగ్ ఇచ్చారు. త్వరలోనే ఉమ్మడి జిల్లా ఎక్సైజ్‌శాఖలో పలువురు సీఐలు, ఎస్ఐల బదిలీలు ఉంటాయని సమాచారం.


జాతీయ సహకార సదస్సులో డీసీసీబీ చైర్మన్



సదస్సులో నాగభూషణం, తదితరులు

ఖమ్మంవ్యవసాయం: అంతర్జాతీయ సహకార దినోత్సవం సందర్భంగా శనివారం న్యూఢిల్లీలో జరిగిన 17వ జాతీయ సహకార కాంగ్రెస్ సదస్సులో జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ) చైర్మన్ కూరాకుల నాగభూషణం పాల్గొన్నారు. నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ స్టేట్ కోఆపరేటివ్ బ్యాంకు లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సులో ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర మంత్రి అమిత్ షా ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. తెలంగాణ నుంచి స్టేట్ కోఆపరేటివ్ అపెక్స్ బ్యాంకు చైర్మన్ కొండూరు రవీందర్‌రావు సహా పలువురు డీసీసీబీ చైర్మన్లు పాల్గొన్నారు.

ప్యాసింజర్ రైళ్ల రద్దు పొడిగింపు



ఖమ్మం మామిళ్లగూడెం: ట్రాక్ మరమ్మతు పనుల కారణంగా పలు ప్యాసింజర్ రైళ్లను రద్దు చేయగా.. ఈ నిర్ణయం 9వ తేదీ వరకు అమల్లో ఉంటుందని ఖమ్మం సీసీఐ జాఫర్ తెలిపారు. విజయవాడ నుండి ఖమ్మం మీదుగా నడిచే ప్యాసింజర్ రైళ్ల రద్దు పొడిగింపు విషయాన్ని ప్రజలు గమనించాలని సూచించారు. ఈమేరకు డోర్నకల్– విజయవాడ(07755), విజయవాడ–డోర్నకల్(07756), భద్రాచలం రోడ్–విజయవాడ(07278), విజయవాడ–భద్రాచలం రోడ్(07279) ప్యాసింజర్ రైళ్ల రద్దును 9వ తేదీ వరకు పొడిగించినట్లు తెలిపారు.

ప్లాంటేషన్‌లో మళ్లీ సాగు మొదలు

- అరకలతో భూమిలోనే రైతులమకాం
- అడ్డుకుని సర్దిచెప్పిన అధికారులు



రైతులు, నాయకులతో మాట్లాడుతున్న అటవీ అధికారులు

కారేపల్లి: వ్యవసాయ సీజన్ ప్రారంభమైనా ప్లాంటేషన్ భూముల్లో సాగుపై అధికారులు తాత్సారం చేస్తుండడంతో పేదలు కుటుంబాలతో సాగు పనులు మొదలుపెట్టారు. ఊట్కూర్ ఫారెస్టు బీట్ పరిధిలోని కారేపల్లి మండలం మాణిక్యారం, ఎర్రబోడు ప్రాంతాల్లోని 250 ఎకరాల్లో 43 కుటుంబాలు ఏళ్లుగా సాగు చేసుకుంటున్నాయి. అయితే, వారికి ప్రత్యామ్నాయం చూపిస్తామని చెప్పిన అటవీ అధికారులు ఆ భూముల్లో మొక్కలు నాటారు. ఆ తర్వాత భూమి చూపించడంలో చేతులెత్తేశారు. మళ్లీ 2020లో వివాదం నెలకొనగా సగం భూమిలో సాగు చేసుకోవచ్చని తెలిపారు. మిగతా వారికి భూమి అప్పగిస్తామనే హామీని విస్మరించడంతో పేదలు శనివారం కుటుంబాలతో సహా ప్లాంటేషన్ వద్దకు చేరుకుని పనులు చేపట్టారు. దానిలో అరకలు కట్టారు. భూమిలో తుప్పలను తొలగించే పనిని చేపట్టారు. పేదలు వంటా వార్పు కూడా అక్కడే చేసుకున్నారు. దీంతో అధికారులు చేరుకుని వారిని అడ్డుకున్నా ససేమిరా అనడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. కారేపల్లి ఎస్ఐ పుష్పాల రామారావు, సిబ్బందితో చేరుకుని పోడుసాగుదారులతో చర్చించారు. ఈ నెల 5వ తేదీలోగా సమస్యపై ఉన్నతాధికారులు నిర్ణయిస్తారని సర్దిచెప్పడంతో అప్పటివరకు ఇక్కడే ఉంటామంటూ రైతులు పోడు భూమిలోనే మకాం వేశారు. సీపీఐ నాయకులు కొండెబోయిన నాగేశ్వరరావు, కె.నరేంద్ర, కరపటి సీతారాములు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ భద్రత సూచనలు పాటించాలి

ఖమ్మంవ్యవసాయం: వర్షాకాలం నేపథ్యాన రైతులు, ప్రజలువిద్యుత్ భద్రతా సూచనలు తప్పక పాటించాలని ఎన్పీడీసీఎల్ సీఎండీ అన్నమనేని గోపాల్‌రావు సూచించారు. ఈ మేరకు శనివారం ప్రకటన విడుదల చేశారు. తడి చేతులతో విద్యుత్ పరికరాలను తాకొద్దని, బట్టలు ఆరేసే తీగలకు విద్యుత్ వైర్లు తాకకుండా జాగ్రత్త వహించాలని చెప్పారు. వర్షం వచ్చిన సమయంలో విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, స్టార్టర్ల డబ్బాలను తాకొద్దని సూచించారు. సరఫరాలో అంతరాయం ఏర్పడితే సిబ్బందికి సమాచారం ఇవ్వాలే తప్ప సొంతంగా మరమ్మతులు చేయొద్దని తెలిపారు. కాగా, పంటలను రక్షించుకునేందుకు విద్యుత్ కంచె ఉపయోగిస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు. విద్యుత్ ఫిర్యాదుల కోసం టోల్‌ఫ్రీ నంబర్ 1800 4250028 లేదా 1912కు ఫోన్ చేయాలని సూచించారు.

స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సత్తుపల్లిరూరల్: రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ ఈబీసీ, మైనార్టీ విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సత్తుపల్లిలో తహసీల్ ఎదుట శనివారం నిరసన తెలిపి తహసీల్దార్ టి.శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం సంఘం కార్యాలయంలో శనివారం మండల, పట్టణ అధ్యక్షులు పామర్తి నాగేశ్వరరావు, చిల్లపల్లి మాధవరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంఘం సంస్థాగత నిర్మాణం, కమిటీల నియామకంతో పాటు భవిష్యత్ కార్యాచరణ వివరించారు. అలాగే, జిల్లా కార్యదర్శిగా చల్లా హనుమంతు, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా మామిళ్ల సత్యనారాయణ, కల్లూరు మండల అధ్యక్షుడిగా బొడ్డుకృష్ణకు నియామక పత్రాలను శ్రీనివాస్ అందించారు. ఆయా కార్యక్రమాల్లో అలవాల కరుణాకర్, లింగన్నబోయిన పుల్లారావు, దుస్సా వెంకటేశ్వర్లు, విలాసకవి వెంకటపతిరాజు, కర్రి కమలాకర్, గుడిద రామకృష్ణ, మరీదు ప్రసాద్, చింతల సత్యనారాయణ, కోటా సత్యనారాయణ, వీరివాడ నాగభూషణం, బాణాల సత్యనారాయణ, వెంకటాచారి, నాగరాజు, బాలకృష్ణ, మట్టా చెన్నారావు పాల్గొన్నారు.

తెగిన రైల్వే విద్యుత్ లైన్

- కారేపల్లి స్టేషన్ సమీపాన నిలిచిన రైలు
- అవస్థ పడిన గ్రూప్‌–4 అభ్యర్థులు, ప్రయాణికులు





కారేపల్లి రైల్వేస్టేషన్‌లో నిలిచిన రైలు (ఇన్‌సెట్) తెగిపోయిన రైల్వే విద్యుత్ లైన్

కారేపల్లి: సాంకేతిక లోపంతో రైల్వే విద్యుత్ లైన్ తెగిపోవటంతో సికింద్రాబాద్ నుంచి మణుగూరు వెళ్తున్న రైలు ఖమ్మం జిల్లా కారేపల్లి రైల్వేస్టేషన్ సమీపాన నిలిచిపోయింది. సికింద్రాబాద్ నుంచి శుక్రవారం రాత్రి బయలుదేరిన రైలు కారేపల్లి రైల్వేస్టేషన్‌కు శనివారం తెల్లవారుజామున 4.15 గంటలకు చేరుకుంది. ఈ క్రమంలో కారేపల్లి – భద్రాచలంరోడ్(కొత్తగూడెం) రైల్వేస్టేషన్ల నడుమ బస్వాపురం రైల్వేగేట్ సమీపాన రైలుకు విద్యుత్ సరఫరా చేసే లైన్ తెగిపోయింది. ఈ విషయాన్ని గమనించిన రైల్వే అధికారులు రైలును కారేపల్లి స్టేషన్‌లోనే నిలిపివేశారు. అయితే, గ్రూప్‌–4 పరీక్ష రాసేందుకు కొత్తగూడెం, మణుగూరు, పాల్వంచ వెళ్తున్న అభ్యర్థులు ఈ విషయం తెలిసి హైరానా పడ్డారు. స్టేషన్ నుంచి బయటకు వందలాది మంది వచ్చేసరికి తగినన్ని ప్రైవేట్ వాహనాలు లేకపోవటంతో ఉన్న కొద్ది ఆటోల్లోనే కిక్కిరిసి వెళ్లారు. ఇంతలోనే అధికారులు నిపుణులను పిలిపించి లైన్‌కు మరమ్మతు చేయించడంతో ఉదయం 7.30 గంటల తర్వాత రైలు మణుగూరుకు బయలుదేరడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

రామయ్యను దర్శించుకున్న పంజాబ్, తమిళనాడు అధికారులు



భద్రాద్రి ఆలయంలో పంజాబ్ అడిషనల్ డీజీపీ తదితరులు

భద్రాచలం/దుమ్ముగూడెం: భద్రాచలంలో శ్రీసీతారామ చంద్రస్వామి వారిని శనివారం వివిధ రాష్ట్రాల ఉన్నతాధికారులు కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. పంజాబ్ అడిషనల్ డీజీపీ ప్రవీణ్‌కుమార్ సిన్హా, తమిళనాడు రాష్ట్ర రవాణాశాఖ కార్యదర్శి టీఎస్ వెంకటేశ్ తదితరులు స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు విజయరాఘవన్, ఏఈఓ భవానీరామకృష్ణ, ఆలయ ఇన్‌స్పెక్టర్ సాయిబాబు పాల్గొన్నారు. అలాగే, టీఎస్ వెంకటేశ్ పర్ణశాలను సందర్శించి స్వామికి పూజలు చేశారు. ఆ తర్వాత పంచవటి కుటీరం, నారచీరల ప్రాంతాలను సందర్శించి చరిత్రను తెలుసుకున్నారు. అధికారులు, సిబ్బంది మల్లికార్జున్‌బాబు, శివరాంరాథోడ్, ముత్తయ్య, కంటెం రాము, శివ పాల్గొన్నారు.

బదిలీలు, పదోన్నతులు నిర్వహించాలి..

టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి



మాట్లాడుతున్న చావా రవి

సత్తుపల్లిటౌన్/పెనుబల్లి: ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ వెంటనే విడుదల చేసేలా కోర్టు కేసుల పరిష్కారంపై ప్రభుత్వం చొరవ తీసుకోవాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి డిమాండ్ చేశారు. భాషా పండితులు, పీఈటీలతో సహా అందరికీ పదోన్నతులు ఇవ్వాలన్నారు. సత్తుపల్లిలో జరిగిన సమావేశంతో పాటు పెనుబల్లి మండలంలోని పలు పాఠశాలల్లో జరిగిన సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ తెలంగాణలో రెండో పీఆర్సీని వెంటనే ప్రకటించాలని.. ఒకవేళ ఆలస్యమైతే మధ్యంతర భృతి విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే, పాఠశాలల్లో బోధన ఉపాధ్యాయుల ఖాళీలను తాత్కాలిక ఉపాధ్యాయులతో భర్తీ చేయాలని, బడుల్లో పారిశుద్ధ్య నిర్వహణకు విద్యాశాఖ నుంచే సిబ్బందిని నియమించడంతో పాటు ఉన్నత పాఠశాలల్లో ఆఫీస్ సబార్డినేట్, క్లరికల్ పోస్టులు మాజూరు చేయాలని సూచించారు. ఇక మన ఊరు – మన బడి పనులు త్వరగా పూర్తయ్యేలా సరిపడా నిధులు మంజూరు చేయాలని కోరారు. సమావేశాల్లో డి.బాలయ్య, ఉమామహేశ్వరరెడ్డి, రమేశ్, రామారావు, శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, మురళీమోహన్, నిర్మలకుమారి, వీరస్వామి, ప్రసాద్, చంద్రశేఖర్, ఈశ్వరాచారి, జి.వీరస్వామి, కె.నాగరాజు, బండి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

హామీలన్నీ అమలు చేయాలి



దీక్షలో చిన్నారులతో మంద కృష్ణ

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ

ఖమ్మంమామిళ్లగూడెం: అనాథ పిల్లల సంక్షేమంపై సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ డిమాండ్ చేశారు. ఖమ్మం ధర్నాచౌక్‌లో శనివారం అనాథల అరిగోస దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా మంద కృష్ణ మాట్లాడుతూ అనాథ పిల్లల సంక్షేమంపై ఇచ్చిన హామీలు అమలుచేయకపోవడం సరికాదని విమర్శించారు. ఇకనైనా మంత్రి వర్గ ఉపసంఘం చేసిన సిఫారసులు అమలు చేయడమే కాక అనాథ పిల్లలకు విద్య, ఉద్యోగాల్లో ప్రత్యేక రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. దీక్షలో ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ నాయకులు తూరుగంటి అంజయ్య, మాచర్ల క్రాంతి, తూరుగంటి రాము, బాకీ శ్రీను, నాగేశ్వరరావు, జ్యోతి, రమ, రూతేశ్ తదితరులు పాల్గొన్నారు.